# ఎవరెవరో!

ఒక్క చోదకుడి చేతిలో ప్రాణాలన్నీ ఉంచి
శరీరాల్ని సరుకుల్లా చేరవేస్తాం
నట్టేట్లో ఎన్ని మార్లు మునిగినా
నమ్మకంతోనే బండిని నడిపిస్తాం

ఎంత రాత్రయినా దారి పొడుగునా
రెప్పలన్నీ పూర్తిగా విప్పుకుని
ఒళ్లంతా వాడికి కళ్లే ఉండాలి
గుండెలో అగ్ని పర్వతాలు పేలుతున్నా
కళ్ళల్లో కనిపిస్తున్న దారే ఉండాలి
తీరా గమ్యం చేరాక – వాడెవరో?

కాస్త ముందో వెనకో
ఎవరి గూట్లో వారు చేరుతుంటామా –
తిరిగొచ్చే వరకూ
తెలిసిన భయాలే
ఒక్కొక్కటిగా గుచ్చుకుని
వాడింట్లో ఎన్ని ఉచ్ఛ్వాస నిశ్వాసాలు
ఉలికులిక్కి పడుతుంటాయో!